17న మంత్రి కేటీఆర్ రోడ్ షో..

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నేతలు

ఎర్రగడ్డ, నవంబర్ 15: మంత్రి కేటీఆర్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఈ నెల 17న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు మద్దతుగా రోడ్ షో నిర్వహించనున్న నేపథ్యంలో బోరబండ డివిజన్ బీఆర్ఎస్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సైట్-2 కాలనీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి డివిజన్ ముఖ్య నాయకులు హాజరయ్యారు. డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్‌కు శ్రీరాంనగర్ వద్ద ఘన స్వాగతం పలకాలని.. అక్కడ ఆయన ప్రసంగిస్తారని.. డివిజన్ నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని కోరారు. ఇక ఎన్నికల ప్రచారంలో భాగంగా రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటి ప్రచారంలో కార్యకర్తలతో కలిసి నాయకులందరూ పాల్గొనాలని సూచించారు. సమావేశంలో సీనియర్ నాయకుడు విజయకుమార్, కోఆర్డినేటర్ విజయసింహ, ఇన్‌చార్జి సిరాజ్ , తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ బరిలో 19 మంది అభ్యర్థులు

1 అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ.. 33 తిరస్కరణ

జూబ్లీహిల్స్,నవంబర్15 : అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 38 మంది అభ్యర్థులు 53 నామినేషన్‌లు వేసిన విషయం తెలిసిందే. ఎన్నికల అధికారులు నిర్వహించిన స్క్రూట్నీ ప్రక్రియలో 33 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బుధవారం నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా ఒక అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో మొత్తం 19 మంది అభ్యర్థులు జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికలో బరిలో నిలువనున్నారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి నామినేషన్ వేసిన నవీన్ యాదవ్ బుధవారం తన నామినేషన్ ఉపసంహరించుకున్నారని జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి వెల్లడించారు. దీంతో 9 మంది స్వతంత్ర అభ్యర్థులతో పాటు వివిధ పార్టీల నుంచి ఆరుగురు.. ప్రధాన పార్టీల నుంచి నలుగురు అభ్యర్థులు పోటీపడనున్నారు.

జూబీహిల్స్ అసెంబ్లీ బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

1) మాగంటి గోపీనాథ్ – బీఆర్ఎస్
2) ఎండి.అజహరుద్దీన్ – కాంగ్రెస్
3) ఎల్.దీపక్ రెడ్డి – బీజేపీ
4) ఎండి.రషీద్ ఫరాజుద్దీన్ – ఏఐ ఎంఐఎం

నేటి నుంచి అయ్యప్ప స్వామి ఆలయంలో

నిత్యాన్నదానం

ఎర్రగడ్డ, నవంబర్ 15: బోరబండ డివిజన్, సైట్-2 కాలనీలోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తులకు గురువారం నుంచి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కమిటీ సమావేశంలో అధ్యక్షుడు జి.లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ.. డిసెంబర్ 31 వరకు అంటే 45 రోజుల పాటు అన్నదానం రోజూ మధ్యాహ్నం 12 గంటలకు ఉంటుందన్నారు. అయ్యప్ప మాలధారణ వేసుకున్న స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు బాలకృష్ణ, కాశీరావు, విజయ్, సత్యనారాయణ, తివారి, నాగరాజు, సోమేశ్, గోవింద్, శ్రీను, మధు, కృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు గోపాలకృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.



బోరబండలోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయం

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

వెంగళరావునగర్, నవంబర్ 15 :బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. జూబ్లీహిల్స్ నియోజవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి,ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సమక్షంలో రహ్మత్ నగర్ డివిజన్ , వినాయక నగర్‌కు చెందిన 100 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ..యువతది దేశ అభివృద్ధిలో ప్రధాన పాత్ర ఉందని అన్నారు. మంచి నాయకులను సమర్థవంతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఓటును ఆయుధంగా చేసుకోవాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లోకి యువ రక్తం చేరడంతో పార్టీకి నూతన ఉత్సాహం అందిందని తెలిపారు. రోజురోజుకి పార్టీలోకి చేరికలు పుంజుకుంటున్నాయని , ప్రజల మద్దతు పెరుగుతుందని అన్నారు. ప్రచారానికి ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని బీఆర్ఎస్‌కు మరో మారు ఓటర్లు పట్టం కట్టబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో డేవిడ్,హరీష్, ప్రవీణ్, గణేశ్ కరుణాకర్, బసవరాజుతో పాటు 100 మంది యువకులు , మహిళలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరినవారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

భారీ మెజార్టీతో గెలిపించాలి..

యూసుఫ్‌గూడ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

జూబ్లీహిల్స్, నవంబర్ 15 : జూబ్లీహిల్స్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం డివిజన్‌లోని యూసుఫ్‌గూడ బస్తీలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును వివరిస్తూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ దాస్, బీఆర్ఎస్ నాయకులు ఇంద్రాణి, అమ్మాజీ, విమల, రజినీ, దేవి, గోపాలస్వామి, నాగ, రాకేశ్, రాజు, సత్యనారాయణ, వేణుగోపాల్, నాగరాజు, సంతోశ్, ఫయీం, రాజు గౌడ్, హసన్, షబ్బీర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాగంటికి మద్దతుగా ప్రచారం.

ఎర్రగడ్డలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు సంజీవ, తదితరులు

ఎర్రగడ్డ, నవంబర్ 15: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌కు మద్దతుగా గులాబీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఎర్రగడ్డ, బోరబండ డివిజన్లలోని దాదాపు అన్ని బస్తీల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవతో సహా పలువురు నేతలు గడప గడపకు వెళ్లి సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు చెప్పే మాయ మాటలను అస్సలు నమ్మొద్దని.. సుపరిపాలన అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా ఎన్నుకుందామని పిలుపు నిచ్చారు. అదే విధంగా మాగంటి గోపీనాథ్ ఘన విజయానికి తోడ్పాటు అందించాల ని కోరారు. ప్రచారం నిర్వహించిన అన్ని వీధుల్లో విశేష స్పందన లభించింది. నిరంతర కరెంటు, తాగునీరు, పేద కుటుంబాలకు బాసటగా ఉంటున్న బీఆర్ఎస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.

విద్యార్థులకు బహుమతులు..

యూసుఫ్‌గూడలోని ఎంజీఎం సీబీఎస్ఈ పాఠశాలలో బుధవారం వార్షిక క్రీడోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎంఎం.నాయుడు, ప్రిన్సిపాల్ కిరణ్ నాయుడు, కోచ్ ఇమ్రోజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. *– జూబ్లీహిల్స్, నవంబర్15*

ఐదు సెల్‌ఫోన్లు చోరీ

హిమాయత్‌నగర్,నవంబర్15: సదర్ ఉత్సవాలను వీక్షించేందుకు వచ్చిన పలువురి సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. నారాయణగూడ పోలీసుల వివరాల ప్రకారం. మంగళవారం రాత్రి నారాయణగూడలోని వైఎంసీఏ చౌరస్తాలో జరిగిన సదరు ఉత్సవాలను వీక్షించేందుకు ప్రజలు తరలించారు. జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో దుండగులు ఐదు సెల్‌ఫోన్లను తస్కరించారు.

అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి..

ఈఆర్వో సేవా ఎస్లావత్.. ఇంటింటికీ పోలింగ్ స్లిప్‌లు పంపిణీ

జూబ్లీహిల్స్,నవంబర్15 : అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్ పేర్కొన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల అధికారులతో కలిసి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ పోలింగ్ స్లిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ఇప్పటికే ప్రతి ఇంటి గోడలు, తలుపుల మీద ఓటు హక్కు ప్రాధాన్యతపై స్లిప్‌లు అంటించామని తెలిపారు. అంతేకాక ప్రతి ఓటరును గుర్తించి ఓటు హక్కు వినియోగించుకోవాలని కరపత్రాలతో ప్రచారం చేశామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 329 పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఓటరును కలిసి పోలింగ్ స్లిప్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్స్, పీడబ్ల్యూడీ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్‌లు పంపిణీ చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులలో ఆసక్తి ఉన్న వారిని పోలింగ్ బూత్‌లకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు, సహాయకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వందశాతం ఓటింగ్ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు ఏసీపీ రాణి, ఏఎంసీలు కమల్, బాలరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏఈఆర్వోలు రాణి, కమల్‌తో కలిసి పోలింగ్ స్లిప్‌లు పంపిణీ చేస్తూ సీనియర్ సిటిజన్‌కు అవగాహన కల్పిస్తున్న ఈఆర్వో సేవా ఎస్లావత్